జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# కోర్టు కేసుల సత్వర విచారణకు సమన్వయంతో పనిచేయాలి





**కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశం**

**బాధితులకు సత్వర న్యాయం అందేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి**

**జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**

మిడ్జిల్, జులై 11, (జర్నలిస్ట్ డైరీ)
మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నందు కోర్టు డ్యూటీ అధికారులు మరియు కోర్టు లైజన్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, కోర్టు విచారణలో ఉన్న కేసులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సాక్షులు సకాలంలో కోర్టుకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా తీవ్రమైన నేరాలు, మహిళలు మరియు చిన్నారులపై జరిగే నేరాలు, పోక్సో, హత్య, దోపిడీ తదితర కేసుల విచారణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కోర్టు డ్యూటీ అధికారులు, కోర్టు లైజన్ అధికారులు, దర్యాప్తు అధికారులు మరియు ప్రభుత్వ అభియోగ న్యాయవాదుల మధ్య సమన్వయం మరింత మెరుగుపరచి, కేసులలో నిందితులకు శిక్షలు పడేలా పటిష్టమైన సాక్ష్యాధారాలను కోర్టులో సమర్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న కోర్టు సమన్లు, వారెంట్లు, ప్రొక్లమేషన్ల అమలుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. కేసుల పురోగతిని నిరంతరం సమీక్షిస్తూ, బాధితులకు సత్వర న్యాయం అందేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సూచించారు. ఈ సమీక్ష సమావేశం నందు DCRB DSP రమణా రెడ్డి, DCRB ఇన్స్పెక్టర్ నర్సింలు, IT సెల్ SI రవి, కోర్టు లైజన్ అధికారులు మరియు కోర్టు డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

# సమాజంలో చదువుతోనే గౌరవం,కీర్తి ప్రతిష్టలు



ఆమనగల్లు,జులై11 (జర్నలిస్ట్ డైరీ)
సమాజంలో చదువుతోనే గౌరవం,కీర్తి ప్రతిష్టలు లభిస్తాయని ఆమనగల్లు క్లాస్మేట్ క్లబ్ రాష్ట్ర కోశాధికారి, రాష్ట్ర వాసవి ఎడ్యుకేషన్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం ఆమనగల్లు మండలంలోని అన్ని పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థులకు 2025..26 సంవత్సరంలో ప్రథమ స్థానంలో వచ్చిన విద్యార్థులకు నగదు పురస్కారం,మోడల్స్ తో పాటు శాలువాలతో ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ సమాజంలో చదువు ఒక్కటే ఆయుధమని, విద్యార్థు లు చదువుకుని వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్టలు తేవాలని, విద్యార్థులు అనుకున్న లక్ష్యాలను చేరుకొని,ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి పాండు,పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘవేందర్,క్లబ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమేష్, రామ్మో హన్, శ్రీనివాస్ ,పాఠశాల ఉపాధ్యాయులు ,విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

## 13న ఉచిత కంటి వైద్య శిబిరంను సద్వినియోగం చేసుకోండి



ఆమనగల్లు,జులై11(జర్నలిస్ట్ డైరీ)
లయన్స్ క్లబ్ ఆఫ్ ఆమనగల్లు వారి ఆధ్వర్యంలో ఈ నెల 13న ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రామ్ రెడ్డి లయన్ ఐ హాస్పిటల్ విజన్ సెంటర్లో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లైన్స్ క్లబ్ పిఆర్ఓ ఎంఎ పాషా తెలిపారు. ఆమనగల్లు మండల పరిసర గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఆర్ఓ పాష తెలిపారు. కంటి చూపు మందగించిన వారు తమ గుర్తింపు కార్డులైన ఆధార్ కార్డు,రేషన్ కార్డు,ఫోన్ నెంబర్ తమ వెంట తెచ్చుకోవాలని ఆయన సూచించారు.

# తెలంగాణలో ఆయిల్ ఫాం సాగు అభివృద్ధికి జంగా రాఘవరెడ్డి కృషి ప్రశంసనీయం

ఉమ్మడి వరంగల్, జూలై 11 (జర్నలిస్ట్ డైరీ)
రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, తెలంగాణలో ఆయిల్ పామ్ సాగు అభివృద్ధికి కృషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అందించిన నాయకత్వం విశేష ప్రశంసనీయమని కాంగ్రెస్ సీనియర్ నాయకులు గుర్రపు కోటేశ్వరరావు అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆయిల్ పే చైర్మన్ గా రెండేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా అభినందనలు తెలిపారు. రైతుల్లో ఆయిల్ పామ్ సాగుపై నమ్మకాన్ని పెంపొందించడం,సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా విస్తరించడం,నాణ్యమైన మొక్కల సరఫరా, ప్రాసెసింగ్ మౌలిక వసతుల బలోపేతం,రైతులకు సాంకేతిక మార్గదర్శకత్వం అందించడం,క్షేత్రస్థాయిలో నిరంతరం రైతులతో మమేకమవుతూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా ఆయిల్



పామ్ రంగానికి కొత్త దిశను చూపించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా,ప్రభుత్వ సంకల్పాలను కార్యరూపంలోకి తీసుకురావాలనే అంకితభావంతో ఆయన చేసిన సేవలు తెలంగాణ వ్యవసాయ రంగ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయి. బాధ్యత,పారదర్శకత, నిబద్ధత,ప్రజాసేవ పట్ల ఉన్న కట్టుబాటుతో ఆయన అందించిన సేవలు రైతుల మన్ననలను సంపాదించారన్నారు. పదవి అనేది ఒక బాధ్యత మాత్రమే,ఆ బాధ్యతను ఎంత నిష్ఠతో,ఎంత సమర్థవంతంగా నిర్వర్తించామన్నదే ఒక నాయకుడి నిజమైన గుర్తింపు ఉంటుందన్నారు. జంగా రాఘవ రెడ్డి తమ రెండేళ్ల పదవీకాలాన్ని విజయవంతమైన సేవా ప్రస్థానంగా నిలబెట్టారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆయిల్ పామ్ రైతులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులందరి తరపున వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులోనూ ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని,రైతు సంక్షేమానికి మరింత విశిష్టమైన సేవలు అందించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నామన్నారు. పదవులు తాత్కాలికం, కానీ ప్రజల హృదయాల్లో నిలిచే సేవ శాశ్వతమని, అధికారానికి అసలైన గౌరవం పదవిలో ప్రజల విశ్వాసంలో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మధుకర్, అశోక్, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ భద్రకాళి దేవాలయంలో శాకాంబరి మహోత్సవాల కరపత్రము ఆవిష్కరణ



ఉమ్మడి వరంగల్ జూలై 11 (జర్నలిస్ట్ డైరీ)
వరంగల్ నగరంలోని ప్రసిద్ధి చెందిన శ్రీ భద్రకాళి దేవాలయంలో ఈనెల 15 నుంచి 29 వరకు నిర్వహించనున్న శాకాంబరి మహోత్సవాల కరపత్రాన్ని శనివారం ఆలయ అధికారులు ఆవిష్కరించారు. ఈనెల 15న ,ఆషాడశుద్ధ పాడ్యమి పురస్కరించుకొని అమ్మవారికి సహస్ర కళాభిషేకం, 29న గురుపౌర్ణమి రోజున వివిధ రకాల కూరగాయలతో శాకాంబరి అలంకారం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మహోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో రావడం జరుగుతుందని అందుకుగాను, తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఈవో, అర్చకులు శేషు ,ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పేదలకు విద్య,వైద్యం అందుబాటులోకి తేవాలి

**సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య**



నిడమనూరు, జూలై 11 (జర్నలిస్ట్ డైరీ)
పేదలకు నాణ్యమైన విద్య, వైద్య సేవలను అందుబాటులో ఉంచి ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య అన్నారు. శనివారం నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రంతో పాటు ప్రభుత్వ పాఠశాలను సీపీఎం మండల కమిటీ సభ్యులతో కలిసి ఆయన పరిశీలించారు.

ఈ సందర్భంగా నారి ఐలయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రుల పరిస్థితిపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముకుందాపురంలో ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం పూర్తై ఏడాదికి పైగా గడిచినా ఇప్పటికీ ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం విచారకరమన్నారు. నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వెంటనే వైద్య సేవలు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ఆరోగ్య ఉపకేంద్రం అందుబాటులోకి వస్తే పరిసర గ్రామాల ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు చేరువవుతాయని, ప్రైవేట్ ఆసుపత్రుల్లో వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సిన అవసరం తగ్గుతుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు అన్ని సబ్జెక్టులకు తగినంత మంది ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, క్రీడా నైపుణ్యాల అభివృద్ధికి ప్రతి పాఠశాలకు ప్రత్యేక వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల పెరుగుదలతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుతోందని, అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఫిల్టర్ తాగునీరు అందిస్తామని ప్రకటించడం మాత్రమే కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కూడా చేపట్టాలని సూచించారు. ముకుందాపురం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీకి సరైన వంటశాల లేకపోవడంతో పాత పరదాల చాటున వంట చేస్తున్నారని, వెంటనే శాశ్వత వంటశాల నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజాప్రతినిధులు, శాసనసభ్యులు ప్రత్యేక చొరవ తీసుకుని ఆరోగ్య ఉపకేంద్రాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొండేటి శ్రీను, మండల కార్యదర్శి కందుకూరి కోటేష్, మండల కమిటీ సభ్యులు మలికంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, ఆవుల శివ, ఆవుల అంజి తదితరులు పాల్గొన్నారు.

## ఆకాశంలో సూర్యుడు చుట్టూ ఏర్పడిన క్రాంతి వలయం...!

● ప్రజలను ఆకట్టుకున్న దృశ్యం



ఉమ్మడి వరంగల్ జూలై 11 (జర్నలిస్ట్ డైరీ)
ఆకాశంలో సూర్యుడు చుట్టూ ఏర్పడిన భారీ క్రాంతి వలయం ప్రజలను ఆకట్టుకుంది .ఉమ్మడి వరంగల్ జిల్లా ములుగులో శనివారం మధ్యాహ్నం కనిపించింది. తెల్లని వృత్తాకార వలయాన్ని చూసిన ప్రజలు మొబైల్ ఫోన్లో చిత్రాలు, వీడియోలు తీశారు. వాతావరణంలోని ఎత్తైన ప్రాంతాల్లో ఉన్న మంచు స్ఫటికాలపై సూర్యకాంతి వక్రీభవించడం వల్లే ఈ సహజ దృశ్యం ఏర్పడుతుందని నిపుణులు పేర్కొన్నారు.

